క్లుప్తంగా

వైభవంగా వీర్ల అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



రేపల్లె రూరల్: చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం పంచాయతీ అక్కల వెంకటరెడ్డిపాలెం గ్రామదేవత వీర్ల అంకమ్మ తల్లి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతర మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామ సర్వతో ముఖాభివృద్ధికి మాజీ సర్పంచ్ దివంగత పులివర్తి కృష్ణమూర్తి సేవలు శ్లాఘనీయమని మాజీ సర్పంచ్ అర్జునరావు పేర్కొన్నారు. సోమవారం భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కృష్ణమూర్తి విగ్రహానికి మాజీ సర్పంచ్ అర్జునరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అర్జునరావు మాట్లాడుతూ గ్రామంలో విద్య, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కృష్ణమూర్తి అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం



నగరం: మండలంలోని జిల్లేపల్లి గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శాస్త్రయుక్తంగా జరిపారు. తొలుత శ్రీలక్ష్మి పద్మావతి అమ్మవారు, వేంకటేశ్వరస్వామి పంచలోహ విగ్రహాలకు సంప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో హేమశంకర్రావు, కృష్ణప్రసాద్, గోపాలరావు, సౌభాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఐదుగురికి బైండోవర్




భట్టిప్రోలు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఐదుగురిని సోమవారం భట్టిప్రోలు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు ఎదుట రేపల్లె ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు హాజరు పరిచారు. బైండోవర్ చేసిన వీరి వద్ద నుంచి రూ.లక్ష సొంత పూచీకత్తు తీసుకున్నారు. ఇక సత్ప్రవర్తనతో ఉండాలని, మరలా ఇదే విధంగా ప్రవర్తిస్తే శిక్షార్హులని తహసీల్దార్ వారిని హెచ్చరించారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం రాచూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు రేపల్లె ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ దివాకర్ తెలిపారు. అతని వద్ద నుంచి 8 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మద్యం విక్రయించడం నేరమని ఆయన తెలిపారు.

పెట్రోల్ బంక్ స్థల పరిశీలన



కర్లపాలెం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం బంక్ నిర్మాణం చేపట్టాలని ఆర్డీవో గ్లోరియా చెప్పారు. కర్లపాలెం హెచ్‌జేబీ డిగ్రీ కళాశాల సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్‌ను ఆర్డీవో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జాతీయ రహదారికి, రోడ్డు పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువకు ఇబ్బంది కలగకుండా బంక్ నిర్మాణం చేయాలని నిర్వాహకులకు చెప్పారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సుందరమ్మ, వీఆర్వోలు అమానుల్లా ఖాన్ శివనాగరాజు తదితరులు ఉన్నారు.

కార్తీక సోమవార ప్రత్యేక పూజలు

రేపల్లె రూరల్: కార్తీక మాసం చివరి సోమవారం కావటంతో పట్టణ, మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. మండలంలోని మోర్తోట గ్రామంలో వేంచేసియున్న ముక్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం నుంచే సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలోని కృష్ణానదిలో భక్తులు ఉదయం నుంచే అధిక సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించి, నదీ తీరంలో కార్తీక దీపారాధనలు నిర్వహించారు. ఆలయంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కృష్ణానదిలో కార్తీక దీపాలను వదిలారు. అదేవిధంగా మండలంలోని అరవపల్లిలో వేంచేసియున్న బాలకోటేశ్వరస్వామి ఆలయంలో, పట్టణంలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వర స్వామి, బేతపూడి చెన్నమల్లేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ముక్తేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

భట్టిప్రోలు: కార్తీక మాసం పురస్కరించుకుని ఆఖరి సోమవారం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. వ్యాఘ్రపురి క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో స్వయంభుగా వెలసిన రాజరాజ నరేంద్రస్వామి వారికి 25వ రోజు ప్రాతఃకాలంలో పంచామృతాలతో అభిషేకాలు, 108 నారికేళాలతో అభిషేకాలు



ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి

నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా జరిపారు. ప్రతి నిత్యం స్వామి వారికి నిత్యకల్యాణం జరుగుతుంది. దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలులోని విశలేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, హేమ విశలేశ్వరస్వామి, ఐలవరం రామలింగేశ్వరస్వామి, వెల్లటూరు అగస్త్యేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని దీపాలు వెలిగించారు.

వసతి గృహం సమస్యలకు పరిష్కారం

- వరుస కథనాలతో స్పందించిన యంత్రాంగం
- మరుగుదొడ్డిని క్లీన్ చేయించిన మున్సిపల్ కమిషనర్

సాక్షి ఎఫెక్ట్



గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి

బాపట్లటౌన్: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై ఈ నెల 21న సాక్షి దినపత్రికలో 'సంక్షామ హాస్టళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనం, ఈ నెల 25న 'సమస్యలు కేరాఫ్ వసతి గృహం' శీర్షికన ప్రచురితమైన మరో కథనాలకు స్పందించిన గిరిజన సంక్షేమ, మున్సిపల్ అధికారులు వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ నెల 22న వసతి గృహంలో వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న గోవింద్‌ను సస్పెండ్ చేసి చీరాల బాలికల వసతి గృహం వార్డెన్ వెంకటస్వామిని ఇన్‌చార్జిగా నియమించారు. అయితే అతను కూడా అందుబాటులో ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి సిబ్బందితో వసతి గృహాన్ని సందర్శించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చెత్తాచెదారం మధ్య విద్యార్థులు ఏ విధంగా జీవిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో విషయాన్ని జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మున్సిపల్ కార్మికులను పిలిపించి శానిటేషన్ చేయించారు. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటాన్ని గమనించిన కమిషనర్ వెంటనే ట్యాంకర్‌ను పిలిపించి సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయించారు. రెండు రోజుల్లో వసతి గృహంలోని పిచ్చిమొక్కలను తొలగించి మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణను ఆదేశించారు. అటు ఉన్నతాధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కార వేదికకు 12 అర్జీలు

రేపల్లె రూరల్: ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. పెనుమూడి పుష్కరఘాట్ నుంచి మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి ఆలయం వరకు అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు అర్జీ అందించారన్నారు. భట్టిప్రోలు మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా నివారించాలని కోరుతూ చల్లపల్లి గ్రామానికి చెందిన అల్లూరి రాజు ఫిర్యాదు చేశాడన్నారు. కొల్లూరులో డ్వాక్రా యానిమేటర్ స్థానంలో ఆమె భర్త పనిచేస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని అర్జీ అందిందన్నారు. అదే విధంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు 1, భూమి, పొలంలు ఆన్‌లైన్ చేయాలని కోరుతూ 5 అర్జీలు, నివేశన స్థల సర్వే చేసి సర్టిఫికెట్ అందించాలని 1, ఆక్రమణల సమస్యపై 1, వివాదంలో ఉన్న భూమిని ఆన్‌లైన్ చేయరాదంటూ 1 అర్జీ అందిందన్నారు. సమస్యలను పరిశీలించి ఆయా శాఖల అధికారులచే పరిష్కరించబడునని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేమూరు: రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో సోమవారం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం 75 కిలోల బస్తా రూ.1,740కు కొనుగోలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ధాన్యం తేమ శాతం 17 ఉంటే కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల కోసం ప్రభుత్వం కొనుగోలు ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు బాపట్ల జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ రేపల్లె ఆర్డీవో రాజలక్ష్మి, డివిజన్ వ్యవసాయాధికారి



ఆర్.విజయబాబు, మండల వ్యవసాయాధికారి సునీత, టీడీపీ నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, వేల్పుల రవికుమార్, షేక్ హనిఫ్, కొడాలి వెంకట్రావు, వట్టిప్రోలు యోబు, పల్ల వాసుదేవరాయలు తదితురులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

చందోలు(కర్లపాలెం): చోరీ కేసులో ముద్దాయిలను అరెస్ట్ చేసి సొత్తు రికవరీ చేసినట్లు చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పిట్టలవానిపాలెం మండలంలోని మంతెనవారిపాలెం హరిజనవాడలో నివాసం ఉంటున్న కర్లపూడి రాజశేఖర్ తమ ఇంటిలో తాళాలు పగలకొట్టి గుర్తు తెలియని వ్యక్తులు మిక్సీ, ఇత్తడి బిందెలు, రూ.40 వేల నగదు దొంగిలించారని 22వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు. తెనాలికి చెందిన గంజి శ్రీను, కట్టా వెంకటేశ్వర్లు, పొన్నూరుకు చెందిన దేవరకొండ కృపరాజులు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి



నిందితులను అరెస్టు చేసిన ఎస్‌ఐ స్వామి శ్రీనివాస్

తీసుకుని వారి వద్ద నుంచి సొత్తు రికవరీ చేసినట్లు చెప్పారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



భట్టిప్రోలులో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్



పల్లెకోన ఎఈఎల్‌సీ ప్యారిష్ చర్చి వద్ద

మొదలైన క్రిస్మస్ సందడి

భట్టిప్రోలు: క్రిస్మస్ పండుగకు భట్టిప్రోలు మండలం ముస్తాబు సంతరించుకుంటుంది. ఏడాదికి ఒకసారి వచ్చే పండుగను దళిత క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. క్రిస్మస్ నెల ఆరంభం కావడంతో చర్చిలకు పెయింటింగ్‌లు వేసేందుకు శ్రీకారం చుడుతున్నారు. అలాగే ఐక్య క్రిస్మస్, మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రంగురంగుల స్టార్‌లు మిరుమిట్లు గొలిపే స్టార్స్‌ను గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద చేస్తున్నారు. డిసెంబర్ 25వ తేదీ వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

చుండూరు(వేమూరు): చుండూరు మండల కేంద్రంలో బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేయడం జరిగిందని వేమూరు ఎక్సైజ్ సీఐ రవి కుమార్ తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకుని వద్ద 15 బాటిల్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. సోమవారం బెల్టు షాపు నిర్వాహకునిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. బెల్టు షాపులు నిర్వహించరాదని ఆయన హెచ్చరించారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు మృతి



రేపల్లెరూరల్: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. రేపల్లె మండలంలోని కైతేపల్లి గ్రామానికి చెందిన మేరుగ రవిబాబు (24) ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు అధికం అవ్వటంతో తీర్చే మార్గం కనిపించక మనస్తాపానికి గురై ఈ నెల 23న పురుగుల మందు తాగాడన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడన్నారు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడు మరణ వాంగ్మూలమిచ్చాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

చుండూరు(వేమూరు): కట్టుపల్లి అంబేద్కర్ అదనపు కట్నం తీసుకొని రావాలని భార్యను హింసకు గురి చేస్తున్నాడని ఎస్‌ఐ షేక్ రహమాన్ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామానికి చెందిన కట్టుపల్లి అంబేద్కర్ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన స్వాతితో రెండు సంవత్సరాల క్రితం వివాహం అయింది. భార్యభర్తల మధ్య విభేదాలు ఏర్పడటంతో సీఐ శ్రీనివాసరావు రెండు సార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. భర్తలో మార్పు రాకపోవడంతో సోమవారం కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ రహమాన్ తెలిపారు.

నిత్యావసరాలు అందజేత

రేపల్లె రూరల్: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవాతత్పరత కలిగి ఉండాలని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ తెలిపారు. పట్టణంలోని న్యూ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేపల్లె చిల్డ్రన్స్ హోమ్‌కు ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సోమవారం నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. ఎన్‌సీసీ కేర్ టేకర్ కాసుల బాలగురవయ్య, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ దాసు, అధ్యాపకులు, నిర్వాహకుడు బాబూరావు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

చుండూరు(వేమూరు): విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల సహకారం పూర్తిగా ఉండాలని గ్రామ సర్పంచ్ భవద్గీత అన్నారు. చుండూరు మండలంలోని దుండిపాలెం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇలోహిం చర్చి మినిస్ట్రీస్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్‌లు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం పరిపూర్ణ ప్రసాద్ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి సరళకుమారి, గ్రామ మహిళ రక్షణాధికారిణి భార్గవి, విజయకుమార్, బూసిరెడ్డి, అన్వేష్, కొండా రెడ్డి పాల్గొన్నారు.

స్త్రీల హక్కుల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం



కర్లపాలెం: స్త్రీల హక్కుల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని కర్లపాలెం తహసీల్దార్ సుందరమ్మ చెప్పారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ మాట్లాడుతూ మహిళలపై జరిగే హింస నివారించేందుకు ప్రభుత్వం పోక్సో, దిశ, నిర్భయ లాంటి చట్టాలను తీసుకువచ్చిందని, వారి అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, డీటీ శ్రీదేవి, సూపరింటెండెంట్ రజని, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి హెచ్చరించారు. బాపట్ల మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్షా సమావేశం సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగింది. మున్సిపాలిటీ ఉద్యోగులు జవాబుదారీతనం, బాధ్యతతో పారదర్శకంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ప్రజలకు మంచి సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్నందుకు కష్టపడి పని చేసి మంచి పేరు సంపాదించుకోవాలని హెచ్చరించారు. చట్టబద్ధంగా పన్నులు చెల్లించడానికి వచ్చే పౌరుల నుంచి నగదు వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని అసహనం వ్యక్తం చేశారు. పలు ఆరోపణలు వస్తున్నాయని, ఉద్యోగులు పద్ధతి మార్చుకోకపోతే ఇంటికి వెళ్లడం తప్పదన్నారు. పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని, నిధులు లేకపోతే ప్రభుత్వానికి నివేదిక పంపాలి, లేదా కలెక్టర్‌కి వివరించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి రెండో చెరువు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉందన్నారు. అమృత్ పథకం కింద ట్యాంక్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలన్నారు. పట్టణ అభివృద్ధికి సూక్ష్మ ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించేలా మనుగడలో ఉన్న పార్కుల అభివృద్ధి, నూతన పార్కుల ఏర్పాటుపై ప్రణాళిక రూపొందించాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద ప్రజల అవసరాలకు తగినట్టుగా సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని చెప్పారు. ప్రతిరోజు 65 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని, చెత్త నుంచి సంపద సృష్టించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సంబంధిత ఏజెన్సీలు నిబంధనలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పట్టణంలో చెత్త లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు పక్కాగా అమలు చేయాలన్నారు. రహదారులు, మురుగునీటి వ్యవస్థ నిర్వహణ సమర్థంగా చేపట్టాలన్నారు. మెప్మాలో పలు ఆరోపణలు వస్తున్నాయని, తప్పులు చేస్తే ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. మహిళల జీవనోపాధి మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు, ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. ప్రజలకు మంచి సేవలతో మేలు చేయాలనే దృక్పథంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి విధులు నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇంటిలోకి దూసుకెళ్లిన కారు

చెరుకుపల్లి: జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ఇంటిలోకి అతివేగంగా కారు దూసుకొచ్చిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల పరిధిలోని గూడవల్లి జాతీయ రహదారి పక్కన దాసరి భాస్కరావుకు చెందిన ఇంటి పంచలోకి ఒక్కసారిగా కారు దూసుకెళ్లింది. కృష్ణా జిల్లా పెడన గ్రామానికి చెందిన నిరంజన్, అవినాష్ బెంగళూరు వెళుతుండగా అర్ధరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో గూడవల్లి మూలమలుపు వద్దకు రాగానే కారు అదుపు తప్పి అతివేగంగా రోడ్డు పక్కన ఉన్న ఇంటి పంచలో తిరగబడింది. అయితే ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

భట్టిప్రోలు: భట్టిప్రోలు ప్రజా సంఘాల కార్యాలయంలో పార్టీ మండల మహాసభ సోమవారం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అధ్యక్షతన జరిగింది. గంగయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున ధాన్యాన్ని తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గ్రామంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని లంక గ్రామాల పంట పొలాలకు పట్టాలు ఇవ్వాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, దళిత వాడల్లో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని కోరారు. భట్టిప్రోలు పీహెచ్‌సీలో స్కానింగ్, ఎక్సరే వంటి సాధనాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తొలుత పార్టీ జెండాను మాజీ సర్పంచ్ బోరుగడ్డ సుబ్బారావు ఆవిష్కరించారు. సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, పార్టీ నాయకులు జి.నాగరాజు, కె.రామస్వామి పాల్గొన్నారు.



సీతారామ్ ఏచూరి, లాజర్, రామస్వామిలకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కార్యదర్శిగా సుధాకర్ ఎన్నిక

పార్టీ మండల కార్యదర్శిగా జి.సుధాకర్ ఎన్నికయ్యారు. సభ్యులుగా పి.మనోజ్ కుమార్, ఎం.సత్యన్నారాయణ, జి.నాగరాజు, కె.రామస్వామి, డి.సత్యన్నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పెదపులివర్రుకు చెందిన జి.లాజర్, నిమ్మగడ్డ రామస్వామిలకు నివాళులర్పించారు.

మహిళలను చిన్నచూపు చూడరాదు

భట్టిప్రోలు: మన దేశం ప్రాచీన కాలం నుంచి మాతృస్వామ్య దేశంగా ఉండేదని.. కాలక్రమేణా పితృస్వామ్య వ్యవస్థగా మార్పు చెంది మహిళలను చిన్న చూపు చూస్తున్నారని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా సోమవారం భట్టిప్రోలు వెలుగు శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో జాతీయ స్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ లలిత కుమారి ప్రారంభించి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో కూడా బాల్య వివాహాలు జరుపుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు జెండర్ ప్రచారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జరుగుతుందని చెప్పారు. ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాల అవకాశం కల్పిస్తుందని చెప్పారు. తొలుత జెండర్ ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి, కోశాధికారి కట్టా జ్యోతి, స్త్రీ నిధి మేనేజర్ పిల్లి అశోక్, సీసీలు హనోక్, రజనీ కుమారి, నరేంద్ర, ఎంఎస్ఏ శిరీష, ఎంఎస్ ఈసీ సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎంపీపీ లలిత కుమారి, ఏపీఎం శ్రీమన్నారాయణ, సమాఖ్య నిర్వాహకులు

అయ్యప్ప ఆలయంలో చద్ది పంపిణీ

కర్లపాలెం: మహాశాస్తస్వామి అయ్యప్ప ఆలయంలో సోమవారం అయ్యప్ప మాలదాధారులకు చద్ది పంపిణీ కార్యక్రమం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా ఆలయంలో పడి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. హైవెండ్ హైస్కూల్ వ్యవస్థాపకుడు ఉదయ్‌చంద్రరావు దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ప్రతి సంవత్సరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దాతల సహకారంతో అయ్యప్ప మాలధారులకు ఆలయంలో చద్ది పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

30న ఉచిత కంటి వైద్య శిబిరం

రేపల్లెరూరల్: పట్టణంలోని వీరపల్లి కోటయ్య కల్యాణ మండపంలో ఈ నెల 30న శనివారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు రోటరీ క్లబ్ రేపల్లె రూరల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కోడూరి కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రటకనలో తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వివరాలకు క్లబ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.